## క్లుప్తంగా

### 'వాటర్ బెల్' అమలు చేయండి



విద్యార్థులతో నీరు తాగిస్తున్న ఎంఈవో జగదీశ్వరి

**వంగర:** పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని ఎంఈవో2 ఖండాపు జగదీశ్వరి ఆదేశించారు. మండలంలోని అరసాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో వాటర్ బాటిళ్లలో నీటిని నింపించి, వారితో తాగించారు. వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బ బారినపడకుండా ప్రతిరోజూ ఉదయం 10, 11, 12 గంటల సమయాల్లో వాటర్ బెల్ కొట్టి విద్యార్థులతో నీరు తాగించాలని సిబ్బందికి సూచించారు.

### గంజాయి కేసుల దర్యాప్తుపై అవగాహన

**రాజాం సిటీ:** స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో గంజాయి కేసుల దర్యాప్తుపై గురువారం అవగాహన కల్పించారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పోలీసులతో ఏపీపీ విజయలక్ష్మి సమావేశమై, గంజాయి కేసుల దర్యాప్తులో పాటించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. నిబంధనల మేర దర్యాప్తు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర, ఎస్ఐలు పి.నీలావతి, ఆర్.గోపాలరావు, ఎక్సైజ్ ఎస్ఐ మాన్యుల్ తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

**రామభద్రపురం:** వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రత్నం, ఈవోపీఆర్డీ వెంకటరమణలతో గురువారం సమావేశమైన ఆయన.. క్రాస్ ప్రొగ్రాం నిర్వహణపై ఆరాతీశారు. ఇంకా ఎన్నిరోజుల కార్యక్రమం ఉంది.. ఏయే గ్రామాల్లో ఎన్నెన్ని బోర్లు బాగు చేశారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని, గ్రామీణులు సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**బొబ్బిలిరూరల్:** మండలంలోని జగన్నాథపురంలో ఉన్న టీచర్స్ కాలనీలో రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ బొద్దల పద్మ, ఎంపీటీసీ సభ్యుడు రౌతు తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొద్దల సత్యనారాయణలు గురువారం భూమిపూజ చేశారు. కాలనీలో రోడ్డు అభివృద్ధి పనులతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.

**రేగిడి:** మండలంలోని లక్ష్మీపురం, అంబాడ, వెంకటాపురం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారు. ఆయా నిర్మాణాలకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి, ఎంపీపీ దార అప్పలనరసమ్మలు జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులను పంచాయతీలకు కేటాయించారు.

### పక్కాగా మెనూ అమలు చేయండి

**తెర్లాం:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈవోలు జె.త్రినాధరావు, ఆర్.పాపారావు సూచించారు. మండలంలోని గొలుగువలస ప్రాథమిక పాఠశాలను వారు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం వంటకాలు, మరుగుదొడ్లు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలని, మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని తెలిపారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**రేగిడి:** క్షయవ్యాధి నిర్మూలనకు 100 రోజుల కార్యక్రమం అనేదానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఆవిష్కరించారు. క్షయ రహిత జిల్లాను రూపొందించే కార్యక్రమంలో భాగంగా రేగిడి, బూరాడ పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో క్షయవ్యాధి నియంత్రణపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు రీనాచౌదరి, చలమయ్యలు తెలిపారు. అనంతరం వ్యాధి లక్షణాలు, దాని నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

### నవధాన్యాల సాగుతో భూసారం

**తెర్లాం:** నవధాన్యాల సాగు చేస్తే భూమి సారవంతమవుతుందని ఏవో జి.సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని నందిగాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ, గ్రామసభ గురువారం నిర్వహించారు. రైతులంతా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వచ్చే ప్రకృతి సాగుపై దృష్టిసారించాలని తెలిపారు. పంటల సాగుకు ముందు నవధాన్యాలు పొలాల్లో జల్లుకుని కలియదున్నాలన్నారు. అనంతరం ప్రకృతి సాగు చేస్తున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్నిపల్లి గంగాగౌరీశంకర్, ఎఫ్‌పీవో ఏపీఎం సీతారాం, ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ తులసి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు వెళ్లే దారేదీ?



తుప్పలు, డొంకలతో రాజాం మండలంలోని అంతకాపల్లి దగ్గరలోని సారథి గెడ్డ



గుర్రపుడెక్కతో నిండిన సంతకవిటి మండలంలోని మల్లయ్యపేట వద్ద నారాయణపురం కుడికాలువ

- రెల్లిగడ్డి, గుర్రపుడెక్కలతో సాగునీటి కాలువలు
- పూడికలతో కుచించుకుపోతున్న గెడ్డలు
- సాగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలు
- ఇంతవరకు జరగని ఉపాధి హామీ పనులు
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ
- ప్రశ్నార్థకంగా ఖరీఫ్‌లో ఆయకట్టుకు సాగునీరు

**రాజాం:** నియోజకవర్గంలో పంటల సాగుకు ప్రధాన ఆధారమైన సాగునీటి కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రధాన కాలువల ఆయకట్టులోని రైతులకూ ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలు తప్పడం లేదు. పిల్లకాలువల ఆయకట్టులోని రైతుల పరిస్థితి అయితే మరీ దారుణం. గతంలో వేసవిలోనే ఈ కాలువల్లో ఉపాధి హామీ పనులు చేయడం, ఇరిగేషన్ శాఖ చక్కని నిర్వహణ కారణంగా కాలువల పరిధిలోని పంటపొలాలకు సాగునీరు సాఫీగా అందేది. ఇప్పుడు ఎక్కడ ఏ కాలువ చూసినా గుర్రపుడెక్కలు, రెల్లిగడ్డి, తుప్పలు, పొదలు, డొంకలతో దర్శనమిస్తున్నాయి. ఇంతవరకు ఎక్కడా ఉపాధి హామీ పథకం పనులు చేపట్టి, కాలువలు బాగు చేసిన ఆనవాళ్లు కనిపించడం లేదు. దీంతో వచ్చే ఖరీఫ్ నాటికి రైతుకు సాగునీటి కష్టాలు తప్పదన్నట్లుగా పరిస్థితి ఉంది.

| మడ్డువలస ఆయకట్టు వివరాలు.. | |
|---|---|
| మండలం | ఆయకట్టు |
| వంగర: | 996.94 ఎకరాలు |
| రేగిడి: | 6,700.76 ఎకరాలు |
| సంతకవిటి: | 10,976.06 ఎకరాలు |
| జి.సిగడాం: | 6,029.03 ఎకరాలు |
| పొందూరు: | 99.20 ఎకరాలు |
| లావేరు, ఎచ్చెర్ల: | 5200 ఎకరాలు(స్టేజ్–2) |

**ఓపెన్‌హెడ్ చానల్స్..**

రాజాంలోని సారధి గెడ్డ, రేగిడిలోని ఏకెఎల్‌గెడ్డ, రేగిడి, సంతకవిటి మండలాల్లోని సాయన్నగెడ్డలు ప్రధాన సాగునీటి కాలువల కన్నా ఆయకట్టుకు మంచిగా సాగునీరు అందించే కాలువలు. ప్రస్తుతం ఈ కాలువలు కూడా ఆయకట్టుకు నీరు అందివ్వలేని దుస్థితిలో ఉన్నాయి. ఓపెన్‌హెడ్ చానల్స్‌గా ఉన్న సాయన్నచానల్ పూర్తిగా కలుపుమొక్కలతో నిండిపోయింది. రేగిడి, సంతకవిటి మండలాల్లో వీటి షట్టర్లు పూర్తిగా పాడవ్వడం, మదుములు అంతరించిపోవడంతో ఖరీఫ్‌లో ముంపు అధికమవుతోంది. నిత్యం వరదలు ఆయకట్టును ముంచేస్తున్నాయి. కాలువ ద్వారా చుక్కనీరు కూడా కిందకు వెళ్లని పరిస్థితి. కాలువ మీదుగా నీరు పొలాల్లోకి చేరి పంటలను ముంచేస్తోంది. గతంలో ఉపాధి పనులు జరిగే ఈ కాలువల్లోనూ ఈ ఏడాది ఉపాధి పనులు జరగడం లేదు. రాజాంలోని సారధి గెడ్డ ద్వారా అయితే ఆయకట్టుకు పూర్తిగా నీరు అందని పరిస్థితి. రాజాం నుంచి సంతకవిటి మండలంలోని మండాకురిటి వరకు ఈ కాలువ ద్వారా 2 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉండగా, ప్రస్తుతం ఈ కాలువ పూర్తిగా లేనట్లుగా కనిపిస్తోంది.



రెల్లిగడ్డి, గుర్రపుడెక్కలతో సంతకవిటి మండలంలోని రామారాయపురం సమీపంలోని సాయన్న గెడ్డ



అధ్వానంగా రాజాం మండలంలోని బొద్దాం దగ్గరి తోటపల్లి ప్రధాన కాలువ



సాగునీరు అంతగా ప్రవహించని రేగిడి మండలంలోని ఏకేఎల్ గెడ్డ

**ఆధునికీకరణ చేస్తాం..**

మడ్డువలస ప్రధాన కాలువలతో పాటు పిల్లకాలువలో మెయింటినెన్స్ పనులకు పలుచోట్ల ఏరియాల వారీగా ఒక్కోచోట రూ.2 లక్షల చొప్పున పనులకు ప్రతిపాదనలు పెట్టాం. పైనుంచి ఆదేశాలు వచ్చి, నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం. అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు జరిగేలా చూడాలని అధికారులను కోరాం. వచ్చే ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

మడ్డువలస కాలువ సబ్‌డివిజన్, రాజాం

**అతీగతీలేని తోటపల్లి..**

రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఖరీఫ్‌లో ఒక్క రాజాం మండలంలో మాత్రమే ఈ కాలువ ద్వారా కొంత ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి ఉంది. ఉప(సబ్) కాలువల ద్వారా రేగిడి, సంతకవిటి మండలాలకు అందాల్సిన నీటిలో ఒక్క చుక్క కూడా రావడం లేదు. రాజాంలోని కంచరాం, బొమ్మినాయుడువలస, బొద్దాం, ముద్దాడజోగివలస తదితర ప్రాంతాలను ఆనుకుని ఉన్న ఈ కాలువలో పూడికలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎక్కడ చూసినా రెల్లిగడ్డి, గుర్రపుడెక్క, నల్లతుమ్మలే కనిపిస్తున్నాయి. వీటిని తొలగించేందుకు గతంలో వేసవిలో ఉపాధి హామీ పనులు చేసేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి ఇంతవరకు లేదు. దీంతో 7200 ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్ సాగుకు నీరు కష్టం తప్పదన్నట్లుగా ఉంది.

**మడ్డువలస ప్రాజెక్టులో కొత్త పనులేవీ..?**

వంగర మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస జలాశయం (ప్రాజెక్టు) ద్వారా వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లోని 19 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి వెళ్లే ప్రధాన కాలువలో జంగిల్ క్లియరెన్స్, ఆధునీకరణ, నిర్వహణ పనులతో పాటు ఆ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి వెళ్తున్న పిల్లకాలువల విస్తరణ పనులేవీ జరగలేదు. దీనిపై ఇరిగేషన్ శాఖ కూడా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆయకట్టు పరిధిలోని రైతులంతా ఆ పనులు ఎప్పుడవుతాయా తమ సాగునీటి కష్టాలు ఎప్పుడు తీరుతాయా అని ఎదురుచూస్తున్నారు.

**నారాయణ.. నారాయణ..**

సంతకవిటి మండలంలో నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట కుడికాలువ ద్వారా సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల్లోని 18,700 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. సంతకవిటి మండలంలో 5,190 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. జైకా నిధులతో అక్కడక్కడ పనులు చేసి వదిలేశారు. ఈ ఏడాది ఉపాధి పనులతో పాటు మెయింటినెన్స్ పనులు కూడా ఇంతవరకు చేయలేదు. దీంతో ఈ కాలువ ద్వారా పిల్లకాలువలకు సాగునీరు సరఫరా ఖరీఫ్‌లో గగనంలా కనిపిస్తోంది.

# కో–ఆప్షన్ సభ్యురాలి ఎన్నిక ఏకగ్రీవం



నియామకపత్రం అందుకుంటున్న షేక్ హయత్ బీబీ



వంగర: ఉప సర్పంచ్‌కు నియామక పత్రం అందిస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రభాకరరావు

**సంతకవిటి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన గురువారం జరిగిన కో–ఆప్షన్ సభ్యురాలి ఎన్నిక ఏకగ్రీవమైంది. మండల కేంద్రానికి చెందిన షేక్ హయత్ బీబీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆమెకు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎ.సోమేశ్వరరావు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్‌లు నియామకపత్రాన్ని అందజేశారు.

**వంగర:** మండలంలోని కొప్పరవలస గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.ప్రభాకర్ పర్యవేక్షణలో గురువారం జరిగిన ఈ ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు ముంజి శకుంతలను సర్పంచ్ సహా మిగతా వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా పనిచేసిన పురిబోను అప్పయ్య తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్నికైన వ్యక్తికి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

# నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**బొబ్బిలి:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని, దరఖాస్తుదారులంతా విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లతో పాటు దరఖాస్తు ఫారం, రైస్, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా వివరాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

**ఎంపీడీవో కార్యాలయాల్లో రేపు..**

**బొబ్బిలిరూరల్:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. మొత్తం 94 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తుదారులంతా దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత ధ్రువపత్రాల ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

**తెర్లాం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి, ఈ నెల 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎంపీడీవో రేగి రాంబాబు తెలిపారు. గ్రామ సచివాలయాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, మండలంలోని 33 పంచాయతీల నుంచి 723 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రామానందం

**బాడంగి:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా లచ్చుపతుల రామానందాన్ని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.విద్యాసాగర్, ఎం.శ్రీనివాసరావులు గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన స్వగ్రామమైన భీమవరంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు.

### వాహన తనిఖీలు

**రేగిడి:** మండలంలోని చిన్నశిర్లాం, బూరాడ జంక్షన్‌ల వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ పి.నీలావతి సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. అలాగే హెల్మెట్ వినియోగించని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ సూచించారు.

### తోటపల్లి జలాలు అందివ్వండి

**బొబ్బిలి:** తెర్లాం మండలం, సతివాడ వద్ద ఉన్న లింగయ్య చెరువుకు పిల్లకాలువను అనుసంధానం చేసి తోటపల్లి జలాశయం జలాలు అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుంచి పిల్లకాలువ ద్వారా నీరు తరలిస్తే ఐదు చెరువులను నీటితో నింపవచ్చని, తద్వారా 1500 ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందించవచ్చన్నారు. తెర్లాం, బాడంగి మండలాల మీదుగా తోటపల్లి కాలువ వెళ్తున్నప్పటికీ ఆయా మండలాల రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కనీసం స్థానిక ఎమ్మెల్యే అయినా స్పందించి సాగునీరు వచ్చేలా చూడాలని కోరారు.

### అత్యవసరమైతే ఆరుబయటకే..



బొబ్బిలి మండలం, మోసూరువలస గిరిజన గ్రామ ఎంపీపీ పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. మల, మూత్ర విసర్జనకు అందులోకి వెళ్తే కూలిపోతుందేమోనన్న భయాందోళన విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఇక్కడి విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు బయటకు వెళ్లి, పాము కాటుకు గురికావడం, జారిపడి గాయాలపాలవ్వడం జరిగేవి. ఈ నేపథ్యంలో అటువంటి ప్రమాదమేమీ లేకుండా బాత్రూమ్‌లు నిర్మించారు. ప్రస్తుతం ఇవి ఏ క్షణాన కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అప్పటిలాగే ఇప్పుడు కూడా విద్యార్థులు అత్యవసరమైతే(మల, మూత్ర విసర్జనకు) ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఎవరు ఎప్పుడు ఏ ప్రమాదం బారినపడతారోనని అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త టాయిలెట్లు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బొబ్బిలిరూరల్

### వడ్రంగుల సమస్యలు పరిష్కరించాలి



వడ్రంగుల సమస్యలు పరిష్కరించాలని ఆ కుల సంక్షేమ సంఘ నాయకులు నారాయణరావు, సత్యనారాయణలు కోరుతున్నారు. జాతీయ వడ్రంగుల దినోత్సవం సందర్భంగా బొబ్బిలి తహసీల్దారు కార్యాలయానికి గురువారం వారు వెళ్లి, తహసీల్దారు ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. తాము తరతరాలుగా చేసే కులవృత్తి పనుల్లోనూ యాంత్రీకరణ వచ్చేసిందని, దీంతో ఉపాధి కరువవుతోందని ఒక్కోసారి పూట గడవని పరిస్థితి నెలకొంటోందని వాపోయారు. తమకు ప్రభుత్వమే ఉపాధి మార్గం చూపేలా చర్యలు తీసుకోవాలని, కనీసం యంత్రాల కొనుగోళ్లకు అయినా రుణాలు మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. –బొబ్బిలిరూరల్

### పనిచేయడం లేదు.. పట్టించుకోరా సారూ..



రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న హ్యాండ్‌వాష్ ట్యాప్ ట్యాంకరు పనిచేయడం లేదు. దీంతో సిబ్బంది, కార్యాలయానికి వచ్చే వారంతా చేతులు కడుక్కోవడానికి దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. చేతుల పరిశుభ్రతే లక్ష్యంగా గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులు, మున్సిపల్ కార్యాలయాల వద్ద వీటిని ఏర్పాటు చేసింది. కాళ్ల దగ్గర ఉండే స్టాండ్‌ను నెమ్మదిగా తొక్కితే ట్యాప్ ద్వారా నీరు వస్తుంది. అప్పట్లో ఇది అందరికీ బాగా ఉపయోగపడేది. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో చేతులు కడుక్కోవడానికి సిబ్బంది చక్కగా దీనిని వినియోగించేవారు. ప్రస్తుతం ఇవి పనికి రాకుండా పోతున్నాయి. వీటి నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి నెలకొంటోందని కార్యాలయానికి వచ్చిన వారంతా అనుకుంటున్నారు. –రాజాం

## సంక్షిప్తంగా...

**రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించాలి**

**రామభద్రపురం:** రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించకపోతే తామే జేసీబీ సాయంతో తొలగించే పనులు చేపడతామని తహసీల్దారు సులోచనరాణి, సీఐ నారాయణరావులు హెచ్చరించారు. ఎస్ఐ వి.ప్రసాదరావు, ఆర్అండ్‌బీ ఏఈ ప్రణయలతో కలిసి మండల కేంద్రంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు ఉన్న ప్రతి దుకాణానికి వారు గురువారం వెళ్లి, ఆక్రమణలు తొలగించాలని ఆ షాపుల యజమానులను ఆదేశించారు. రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు జరగడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, రోడ్డు ఎడ్జ్‌కు 20 అడుగుల వరకు ఉన్న ఆక్రమణలను తొలగించాలని తెలిపారు. ఇదిలా ఉంటే, రోడ్డు మధ్య నుంచి 30 అడుగుల వరకు ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధంగా ఉన్నామని మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టా రామారావు, గుర్రాల ఈశ్వరరావులు స్పష్టం చేశారు.

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి**

**సంతకవిటి:** గంజాయి, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, సారా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మామిడిపల్లి, సురవరం, మండాకురిటి గ్రామాల్లో మాదకద్రవ్యాలు(మత్తు పదార్థాలు) వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి దురలవాట్లకు బానిసలై జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి నడవడికను అలవర్చుకోవాలని, ఉత్తమ పౌరులుగా జీవించాలన్నారు.

**బొబ్బిలిరూరల్:** నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొయ్యికొండవలస, నిమ్మలపాడు గిరిజన గ్రామాల్లో సారా నియంత్రణపై గురువారం అవగాహన కల్పించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు.. సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరించారు. సారాకు బానిసలైన ఎంతోమంది జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని, ప్రతిఒక్కరూ సారాకు దూరంగా ఉండాలన్నారు.

**తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలి**

**బాడంగి:** మండలంలోని ఉపాధి హామీ పథకం వేతనదారులకు బకాయి పడిన వేతనాలను తక్షణమే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. మండలంలో పలుచోట్ల జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు గురువారం వెళ్లి, అక్కడి వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమకు 10 వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. రోజువారీ కూలిడబ్బులపై ఆధారపడి బతికే తమకు ఇలా చేస్తే ఎలా అని వారు వాపోయారు. ఈ మేరకు స్పందించిన ఆయన.. వేతనదారులకు సకాలంలో వేతనాలు అందివ్వాలని, రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా చూడాలని కోరారు.

**30న శ్రీకళాభారతిలో ఉగాది ఉత్సవాలు**

**బొబ్బిలి:** స్థానిక శ్రీకళాభారతిలో ఈ నెల 30వ తేదీన ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకళాభారతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్దా సత్యనారాయణ, నంబియార్ వేణుగోపాలరావులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఉత్సవాలు మొదలవుతాయని, సాయంత్రం 5 గంటలకు పండితులు నిష్టల ధర్మారావుచే పంచాంగ పఠనం ఉంటుందన్నారు. 5.45 గంటలకు గయోపాఖ్యానం, పాండవ ఉద్యోగ విజయాల్లోని ప్రధాన ఘట్టాలను స్థానిక కళాకారులతో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 6.40 గంటలకు కోలాట ప్రదర్శన, రాత్రి 8 గంటలకు నాటకరంగ కళాకారులకు సత్కారాలు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

**సర్వేలు వేగవంతం చేయండి**

**రాజాం సిటీ:** గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పొగిరి గ్రామ సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. మిస్సింగ్ పర్సన్స్ డేటా ఎంట్రీ, హౌస్‌హోల్డ్ జియోట్యాగ్, వర్క్‌ఫ్రమ్ హోమ్, శానిటేషన్, పీఆర్ వన్‌యాప్, ఇంటిపన్ను వసూళ్ల వంటి సర్వేలపై సిబ్బందిని ఆరాతీశారు. సర్వేల లక్ష్యాలు చేరుకోవాలని సిబ్బందికి తెలిపారు.

**ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి**

**రేగిడి:** భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులైన చిన్నారులకు అందిస్తున్న ఫిజియో థెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు రమాచంద్రికా కోరారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ గురువారం చేసిన ఆమె.. ఇక్కడి చేసిన మాదిరిగానే ఇంటి వద్ద కూడా చేయాలని అలా అయితేనే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎంపీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు తదితరులు పాల్గొన్నారు.

**సదరం రీ వెరిఫికేషన్‌కు అవస్థలు**

**రాజాం:** స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద జరుగుతున్న సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌కు వస్తున్న దివ్యాంగులకు శ్రీకాకుళం నుంచి వస్తున్న వైద్యులు ముప్పతిప్పలు పెడుతున్నారు. ఆన్‌లైన్ సదరం ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, మళ్లీ ఎక్సరేలు, స్కానింగ్‌లు చేయించుకుని రావాలని ఒకటికి పది సార్లు రమ్మని తిప్పిస్తున్నారని నానా అవస్థలు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. చేసేదేమీ లేకపోవడంతో దివ్యాంగులంతా పలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి, ఎక్సరేలు, స్కానింగ్‌లు చేయించుకుని చేతిచమురు వదిలించుకుంటున్నారు. ఒక్క సర్టిఫికెట్ల పరిశీలనకే మూడు నుంచి నాలుగు రోజులు తిరగాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ గట్టిగా అడిగినా, ప్రశ్నించినా వెరిఫికేషన్‌లో పర్సంటేజీ పోతుందేమోనని భయపడుతున్నారు.

**విద్యార్థులకు అభినందనలు**

**రాజాం/రాజాం సిటీ:** నవోదయ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించి, నవోదయ ఆదర్శ పాఠశాలలకు ఎంపికైన పలువురు విద్యార్థులను పాఠశాల సిబ్బంది గురువారం అభినందించారు. మండల పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గార రవిచంద్ర, ముద్దాడ జోగివలస ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కె.కుసుమలను ఎంఈవోలు బి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు, ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణలు సత్కరించి, ప్రోత్సహించారు. భవిష్యత్‌లో బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. రవిచంద్రను అదే పాఠశాలలో సిబ్బంది సన్మానించి అభినందించగా, కుసుమను స్థానిక ఎమ్మార్సీలో సత్కరించి అభినందించారు.

# గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదుపై విచారణ



విచారణ చేపడుతున్న ఏపీవో విజయలక్ష్మి

**బాడంగి:** మండలంలోని పింద్రంగివలస గ్రామానికి మంజూరు కావాల్సినన్ని గోకులాలు మంజూరు కాకపోవడంపై ఆ గ్రామానికి చెందిన రౌతు సురేష్.. దరఖాస్తుదారుల తరఫున ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో ఆదేశాలతో ఏపీవో విజయలక్ష్మి గురువారం ఆ గ్రామానికి వెళ్లి, ఫిర్యాదులో పేర్కొన్న విషయంపై విచారణ చేపట్టారు. గ్రామానికి 11 గోకులాలు అవసరమని పంచాయతీ తీర్మానం జరిగిందని, కేవలం రెండు గోకులాలు మాత్రమే మంజూరు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని ఫిర్యాదుదారు, దరఖాస్తుదారులు తెలిపారు. ఆ తర్వాత సర్పంచ్ రావాడ రమణమ్మ అధ్యక్షతన జరిగిన విచారణలో తొలి విడతలో ప్రతి గ్రామానికి రెండు చొప్పున గోకులాలు ఇవ్వడం జరిగిందని ఏపీవో చెప్పగా పెదపల్లిలో ఒకే దఫా 28 గోకులాలు ఎలా ఇచ్చారని దరఖాస్తుదారులు ప్రశ్నించారు. అసలు ఆవులే లేని ఫీల్డ్ అసిస్టెంట్ భార్యకు గోకులం ఎలా ఇచ్చారని నిలదీశారు. ఆ తర్వాత ఏపీవో మాట్లాడుతూ రెండో విడత కింద మరో మూడు గోకులాలు ఇస్తామని, అవసరమైతే మరో నాలుగు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విచారణ నివేదికను ఎంపీడీవోకు సమర్పించనున్నట్లు ఆమె తెలిపారు.

# పంటల బీమా ప్రీమియం రద్దు సరికాదు



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్షుంనాయుడు

**బొబ్బిలి:** రైతులకు గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన పంటల బీమా ప్రీమియం ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం రద్దు చేయడం సరికాదని రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలోని రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అసలే రైతులు పెట్టుబడి సాయం లేక.. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతుంటే గతంలోని ఉచిత పంటల బీమా ప్రీమియం కూడా తీసేస్తే వారెలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు ఏటా ఇస్తామన్న రూ.20 వేలు ఆర్థికసాయం ఎప్పుడిస్తారని అడిగారు. జైకా నిధులతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను కూడా ఈ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వేసవిలో కాకుండా వర్షాకాలంలో ప్రాజెక్టుల ప్రగతి పట్టాలెక్కిస్తారా అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేసే ఆలోచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాంబార్కి తిరుపతిరావు, లచ్చుపతుల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.